

# పల్లె వెలుగు


తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028


పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటిని విడుదల చేయాలి.




Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి -14 | సంచిక - 218 | పేజీలు - 08 | వెల - 05/- | మంగళవారం 04-08-2026





## తాగునీటి ఎద్దడి సమస్యపై దృష్టి పెట్టండి

- రవాణా శాఖలో అనవసర నిబంధనలు తొలగించండి
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 3: ఎల్ నినో పరిస్థితుల కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి ఎద్దడి సమస్యపై దృష్టిపెట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను, రిజర్వాయర్లలో, నీటి వనరుల్లో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు అంచనా వేసుకుంటూ తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్లో సోమవారం వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఎగువన వర్షాలు కురుస్తున్నందున్న కృష్ణా బేసిన్ లో నీటి లభ్యత పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయని అధికారులు వివరించారు. కృష్ణానదిలో కొద్ది రోజులుగా ప్రవాహాలు మొదలైనట్లు వివరించారు. అలాగే గోదావరిలో వరద పరిస్థితిని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. కృష్ణా బేసిన్లో ఎగువ నుంచి వచ్చే వరదను సద్వినియోగం చేసుకునేలా నీటి నిర్వహణ చేపట్టాలని సీఎం ఆదేశించారు. వర్షాభావం వల్ల రానున్న రోజుల్లో పశుగ్రాసం కొరత వచ్చే అవకాశం ఉందని...అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపాల్టీలు, గ్రామీణ ప్రాంతాల్లో తరుచూ తాగునీటి పరీక్షలు జరపాలని...

మిగతా 2లో

## గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పనుల్లో వేగం పెంచండి



- 2026--27 లక్ష్యాలు రెండు నెలల్లో పూర్తి కావాలి
- గత రెండేళ్లలో మడ అడవుల విస్తరణలో దేశంలో ద్వితీయ స్థానం సాధించాం
- ఈ ఏడాది మరింత బాధ్యతగా మడ అడవుల పెంపకం చేపట్టాలి
- తాటి వనాలు, సామాజిక వనాల ఏర్పాటులో ప్రజా భాగస్వామ్యం పెరగా

తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణ, కోతల నివారణ చర్యల్లో భాగంగా కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టు గ్రేట్

మిగతాది 2లో

## "మిస్టర్ డ్రామారావు" అంటూ కేటీఆర్ పై మంత్రి పొంగులేటి ఫైర్

పదేళ్లలో మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించారని విమర్శ

- పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని ఆరోపణ
- అధికార లాంఛనాలతో గౌరవించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని వెల్లడి
- వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని వ్యాఖ్య




తెలంగాణ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దివంగత ఉద్యమ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మరణాన్ని కేటీఆర్ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపిస్తూ సోమవారం 'ఎక్స్' వేదికగా ఘాటు విమర్శలు చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఆయన్ని విస్మరించి, ఇప్పుడు ఆయన మరణంపై రాజకీయం చేస్తున్న 'మిస్టర్ డ్రామారావు' కేటీఆర్ అంటూ పొంగులేటి మండిపడ్డారు.

మిగతాది 2లో

## నాడు టైటానిక్ లో ప్రయాణికులు ఏం తిన్నారు?

- టైటానిక్ షిప్‌లో ప్రయాణికుల తరగతిని బట్టి భోజన సదుపాయాలు
- ఫస్ట్ క్లాస్ ప్రయాణికులకు విలాసవంతమైన బహుళ రకాల వంటకాలు
- సెకండ్ క్లాస్‌లో కూడా నాటి కాలానికి నాణ్యమైన ఆహారం
- థర్డ్ క్లాస్ టికెట్‌లోనే భోజనం కలిపి ఉండటం నాటి ప్రత్యేకత


2

టైటానిక్ నౌక అనగానే అందరికీ దాని విషాదాంతమే గుర్తుకు వస్తుంది. అయితే, 1912 ఏప్రిల్ 15న సముద్రగర్భంలో కలిసిపోవడానికి ముందు ఆ నౌక ఒక

## బీజేపీకి భారీ షాక్..

### బంకీపూర్ కోట బద్దలు కొట్టిన ప్రశాంత్ కిశోర్

- 19,324 ఓట్ల ఆధిక్యంతో బీజేపీ అభ్యర్థిపై గెలుపు
- మూడు దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న స్థానం కైవసం
- ఎన్నికల బరిలో తొలి విజయాన్ని అందుకున్న జన సురాజ్ పార్టీ

ప్రముఖ రాజకీయ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ (పీకే) ప్రత్యక్ష రాజకీయాల్లో సంచలన విజయాన్ని నమోదు చేశారు. బీహార్‌లోని బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప


2

## పెద్ది సుదర్శన్ రెడ్డి విషయంలో అది అత్యంత బాధాకరం: కేటీఆర్

- సుదర్శన్ రెడ్డి ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాడేవారన్న కేటీఆర్
- విద్యాశాఖలోని బెడ్స్ కుంభకోణాన్ని ఆధారాలతో సహా బయటపెట్టారని వెల్లడి
- అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని మండిపాటు




దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిపై తెలంగాణ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చిందన్న ఆరోపణలు నిజమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సుదర్శన్ రెడ్డి విషయంలో తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలను ఏ ఒక్కరినీ వదలకుండా వేధింపులకు, టార్చర్‌కు గురిచేస్తోందని ఆయన ఆరోపించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి నిత్యం ప్రజా సమస్యలపై పోరాడేవారని, ప్రభుత్వంలోని అక్రమాలను నిరంతరం బయటపెట్టేవారని కేటీఆర్ గుర్తుచేశారు. సివిల్ సప్లైస్ స్కామ్‌తో పాటు విద్యాశాఖలోని బంకర్ బెడ్స్ కుంభకోణాన్ని ఆధారాలతో

మిగతాది 2లో



## కోర్టులో లొంగిపోయిన తమ్మినేని కుమారుడు.. బెయిల్ మంజూరు!

- భూకబ్జా కేసులో కోర్టులో లొంగిపోయిన తమ్మినేని కుమారుడు చిరంజీవి నాగ్
- ఆరోగ్య కారణాలను పరిగణనలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేసిన శ్రీకాకుళం కోర్టు
- ఈ కేసులో ఏ5గా చిరంజీవి, ఏ6గా తమ్మినేని సీతారాం, ఏ7గా ఆయన భార్య వాణిశ్రీ
- ఈ నెల 10వ తేదీన విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశం

2

## భారత ఐటీ రంగానికి కొత్త హెచ్చరిక..

హెచ్‌సీఎల్ టెక్‌తో ఒప్పందంలో గూగుల్ కోత

- హెచ్‌సీఎల్‌టెక్ ఒప్పందాన్ని ఏటా 5 కోట్ల డాలర్లు తగ్గించిన గూగుల్
- ఏఐ, ఆటోమేషన్‌తో అవుట్‌సోర్సింగ్‌లో మార్పులు
- వెయ్యి మంది ఉద్యోగుల పునర్విభజనకు అవకాశం
- భారీ ఉద్యోగ కోతలు ఉండవని సంకేతాలు

2




ఏఐ ప్రభావం ఐటీ రంగంపై మరింత స్పష్టంగా కనిపిస్తోంది. ఒకప్పుడు భారీ మానవ వనరులపై ఆధారపడిన ప్రాజెక్టులు ఇప్పుడు ఆటోమేషన్, కృత్రిమ మేధతో కొత్త రూపం దాలుస్తున్నాయి. ఈ మార్పులో భాగంగా గూగుల్ కీలక నిర్ణయం తీసుకుంది. దశాబ్దకాలంగా హెచ్‌సీఎల్‌టెక్‌తో కొనసాగుతున్న ఒప్పందాన్ని కుదిస్తూ కొత్త సంకేతాలు ఇచ్చింది. అయితే ఉద్యోగుల తొలగింపుల కంటే పనుల పునర్విభజనకే కంపెనీ ప్రాధాన్యం ఇవ్వడం గమనార్హం. అయితే భారత ఐటీ రంగానికి ఈ పరిణామాన్ని కొత్త హెచ్చరికగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. గూగుల్ తన అప్లికేషన్ డెవలప్‌మెంట్, ఇంజినీరింగ్ సేవల్లో భాగంగా హెచ్‌సీఎల్‌టెక్‌కు అప్పగించిన అవుట్‌సోర్సింగ్ ఒప్పందాన్ని ఏడాదికి ఐదు కోట్ల డాలర్ల మేర తగ్గించినట్లు

## ఎన్నికల రాజకీయాల్లోకి కాక్రోచ్ పార్టీ?


- సీజేపీ బలోపేతమే తొలి లక్ష్యమన్న దీప్కే
- వాలంటీర్లతో సమీక్ష తర్వాత భవిష్యత్ కార్యాచరణ
- ప్రజల్లో భయం పోవడమే ఉద్యమ అసలు విజయం
- ఎన్నికల రాజకీయాలపై ప్రస్తుతం ఆసక్తి లేదని స్పష్టీకరణ
- ప్రజా ఉద్యమాలే ప్రజాస్వామ్యానికి బలమని అభిప్రాయం
- నిరుద్యోగం, విద్య రాజకీయ అంశాలేనని వ్యాఖ్య

మిగతాది 2లో



## అంతర్జాతీయ వేదికపై కశ్మీరీ ఎంఎంఏ ఫైటర్ సత్తా..

- బల్గేరియాలో జరిగిన బ్రేవ్ సీఎఫ్ 107 ఈవెంట్‌లో కశ్మీరీ ఫైటర్ విజయం
- రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్ అయిన ఫైటర్‌ను ఓడించిన ఓవైస్ యాకూబ్
- విజయం పట్ల జమ్మూ కాశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా హర్షం, అభినందనలు



అంతర్జాతీయ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఏ) యవనికపై ఓ భారతీయ యువకుడు సంచలనం సృష్టించాడు. జమ్మూ కశ్మీర్‌కు చెందిన ఓవైస్ యాకూబ్, బల్గేరియాలో జరిగిన

మిగతాది 2లో

# బీజేపీకి భారీ షాక్.. బంకీపూర్ కోట బద్దలు కొట్టిన ప్రశాంత్ కిశోర్

ప్రముఖ రాజకీయ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ (పీకే) ప్రత్యక్ష రాజకీయాల్లో



సంచలన విజయాన్ని నమోదు చేశారు. బీహార్‌లోని బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో ఆయన ఘన విజయం సాధించారు. దాదాపు మూడు దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న ఈ స్థానంలో, ఆ పార్టీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాపై సుమారు 19,324 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సోమవారం జరిగిన ఓట్ల లెక్కింపులో మొత్తం 32 రౌండ్ల ముగిసేసరికి ప్రశాంత్ కిశోర్‌కు 64,151 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్‌కు 44,827 ఓట్లు పోలయ్యాయి. ఇక ఆర్జేడీ అభ్యర్థి రేఖా కుమారి 14,273 ఓట్లతో మూడో స్థానానికే పరిమితమయ్యారు. ఈ విజయంతో ప్రశాంత్ కిశోర్ తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు. ఆయన స్థాపించిన జన సురాజ్ పార్టీకి సైతం ఇదే తొలి ఎన్నికల విజయం కావడం విశేషం. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాజ్యసభకు ఎన్నిక కావడంతో బంకీపూర్ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. 1995 నుంచి (గతంలో పట్నా పశ్చిమ స్థానంగా పిలిచేవారు) ఈ నియోజకవర్గం బీజేపీకి తిరుగులేని కోటగా ఉంది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జన సురాజ్ పార్టీ అనేక స్థానాల్లో పోటీ చేసినప్పటికీ ఒక్క చోట కూడా విజయం సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో పీకే సాధించిన విజయం ఆ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ ఫలితంపై బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, మంత్రి విజయ్ కుమార్ సిన్హా స్పందిస్తూ, ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రశాంత్ కిశోర్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ ఉప ఎన్నికలో కేవలం 34.30 శాతం మాత్రమే పోలింగ్ నమోదు కావడం గమనార్హం. పాట్నా లాంటి పట్టణ ప్రాంతంలో, బీజేపీకి అత్యంత పట్టున్న స్థానంలో ప్రశాంత్ కిశోర్ విజయం సాధించడం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పనుల్లో వేగం పెంచండి

భాగంగా కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టు గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్



పనుల్లో వేగం మరింత పెరగాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ పర్యావరణ శాఖల మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఆదేశించారు. ఈ ఏడాది నిర్దేశిత లక్ష్యాలను వాతావరణ అనుకూలతల అనుగుణంగా వచ్చే రెండు నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని స్పష్టం చేశారు. గ్రేట్ గ్రీన్ వాల్ లక్ష్య సాధనలో భాగంగా గడచిన రెండేళ్ల కాలంలో సాధించిన పురోగతికి జాతీయ స్థాయి గుర్తింపు లభించిన అంశాన్ని గుర్తు చేశారు. మడ అడవుల విస్తరణలో దేశంలో రెండో స్థానం సాధించేందుకు కృషి చేసిన అధికారులకు అభినందనలు తెలియజేశారు.

సోమవారం మధ్యాహ్నం గ్రేట్ గ్రీన్ వాల్ పనుల పురోగతిపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. డివిజన్లవారీగా నిర్దేశించిన లక్ష్యాలు ఎంత వరకు పూర్తి చేశారు? ఇప్పటి వరకు ఎన్ని మొక్కలు నాటారు? ఈ ఏడాది మడ అడవులు ఎంత విస్తీర్ణంలో నాటనున్నారు? తదితర వివరాలను అంశాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీబీ జీ రాం జీ పథకంలో భాగంగా తీర ప్రాంత జిల్లాలకు అదనంగా మరో 70 లక్షల మొక్కలు కేటాయించిన విషయాన్ని గుర్తు చేసిన శ్రీ పవన్ కళ్యాణ్ గారు, ఇవి గ్రేట్ గ్రీన్ వాల్ లక్ష్య సాధనకు అదనపు బలం కానున్నాయని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ “వాతావరణ మార్పుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు తలెత్తాయి. ప్రస్తుతం తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న తీర ప్రాంత జిల్లాలకు విపత్తుల ముప్పు పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి అసాధారణ వాతావరణ పరిస్థితుల నుంచి మన తీరాన్ని రక్షించుకోవడంలో గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కీలక భూమిక పోషించనుంది. అందుకే కూటమి ప్రభుత్వం గ్రేట్ గ్రీన్ వాల్‌ను ప్రతిష్ఠాత్మకంగా ముందుకు తీసుకువెళ్తోంది. రాష్ట్రంలో విస్తరించి ఉన్న 1,053 కి.మీ. తీర ప్రాంతం వెంబడి 5 కిలోమీటర్ల వెడల్పున పచ్చదనంతో కూడిన గోడను ఏర్పాటు చేస్తున్నాం. అందులో ఈ ఏడాది 8,888 హెక్టార్లలో గ్రీన్ వాల్ విస్తరణకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశాం. మొదటి అర్ధభాగంలో వాతావరణ అనుకూలతల ఆధారంగా

కొంత మేర మొక్కలు నాటే ప్రక్రియ పూర్తయ్యింది. ద్వితీయార్థంలో తాటి విత్తనాలు అందుబాటులోకి రానున్నాయి. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వీటి సేకరణ, నాటే ప్రక్రియను పూర్తి చేయాలి. దాదాపు 5,000 హెక్టార్లలో తాటి వనాల ఏర్పాటును ఈ ఏడాది లక్ష్యంగా పెట్టుకున్నాం. కాలువ గట్లు, చెరువులు, తీర ప్రాంతాల్లో తాటి చెట్లు గాలి నిరోధక వ్యవస్థగా నిలుస్తాయి. తాటివనాలు, సామాజికవనాల ఏర్పాటు పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలి.

**లిమడ అడవుల విస్తరణలో పురోగతిలి**

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గడచిన రెండేళ్లలో మడ అడవుల పెంపకంలో చక్కటి పురోగతి సాధించాం. 2024-25 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 740 హెక్టార్లు, 2025-26లో 1,930 హెక్టార్ల మేర మడ అడవుల విస్తరణ చేపట్టాం. తద్వారా మడ ఫారెస్టింగ్‌లో దేశంలోనే రెండో స్థానంలో నిలిచాం. ఈ అద్భుత ఘనత సాధనకు కృషి చేసిన సిబ్బందికి, సహాయ సహకారాలు అందించిన పర్యావరణ నిపుణులకు హృదయపూర్వక అభినందనలు. సాధారణంగా మడ అడవుల స్థాపనకు అక్టోబర్ నుంచి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. ఈ ఏడాది మరింత బాధ్యతాయుతంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లాలి. నవంబర్, డిసెంబర్ మాసాల్లో మిష్టి--×× (వీ×ూను×-××) కింద 305 హెక్టార్లలో మడ అడవుల పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించాం. తీర ప్రాంత రక్షణ కవచం అయిన మడ అడవుల ప్రాధాన్యతను గ్రహించి, నిర్ణీత సమయంలో విస్తరణ కార్యక్రమాలు పూర్తి చేయాలి.

లిజిల్లాలవారీగా నిర్దేశిత లక్ష్యాలులి

గ్రేట్ గ్రీన్ వాల్ కార్యాచరణ ప్రణాళికల్లో భాగంగా ఈ ఏడాది 48 హెక్టార్లలో పరిహార అటవీకరణ చేపట్టాం. ఇది చాలా వరకు పూర్తి కావచ్చింది. అత్యధికంగా 5 వేల హెక్టార్లలో తాటి వనాలు నాటుతున్నాం. గ్రీన్ క్లైమేట్ ఫండ్ కింద మరో 1,993 హెక్టార్లను దేశీయ మొక్కలతో నింపేయనున్నాం. 727 హెక్టార్లలో షెల్టర్ బెల్ట్ ప్లాంటేషన్లు లక్ష్యాలుగా నిర్దేశించాం. వీటిలో మడ అడవులు, తాటి వనాలు మినహా మిగిలిన అటవీకరణ అంచెల వారీగా చేపట్టాలి. తీర ప్రాంత పర్యావరణ వ్యవస్థలు, క్షీణించిన భూభాగాల పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇవ్వాలి.

వీబీ జీ రాం జీ ద్వారా తీర ప్రాంతం వెంబడి నాటేందుకు వీలుగా మరో 70 లక్షల మొక్కలు సిద్ధం చేస్తున్నాం. సుమారు 2,500 హెక్టార్లలో ఈ మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించాం. అందులో ఒక్క రాజమహేంద్రవరం సర్కిల్‌లోనే 3,243 హెక్టార్లలో కలప ఉత్పత్తి, దేశీయ మొక్కలు నాటనున్నాం. గుంటూరు సర్కిల్‌లో 1,832 హెక్టార్లు, విశాఖ సర్కిల్‌లో 1,764 హెక్టార్లు లక్ష్యంగా పెట్టుకున్నాం. గ్రేట్ గ్రీన్ వాల్ కార్యక్రమం కింద 5 కిలోమీటర్ల వెడల్పుతో తీరానికి మూడంచెల రక్షణ వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టాం. అందులో మొదటి రక్షణ వలయంలో తీరపు అంచుల్లో మడ అడవుల పునరుద్ధరణ, షెల్టర్ బెల్ట్‌ల మొక్కల పెంపకం, రెండు, మూడు వలయాలను కమ్యూనిటీ బఫర్ జోన్లుగా గుర్తించి గ్రామ వనాలు, సామాజిక వనాలు, వ్యవసాయ వనాల పెంపకాన్ని ప్రజలు, వివిధ శాఖల సమన్వయంతో చేపడుతున్నాం. స్థానిక పర్యావరణ పరిస్థితులు, వర్షపాతం, భౌగోళిక స్వభావాలను పరిగణనలోకి తీసుకుని వీటి అమలు చేపట్టాలి. గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ముందుకు తీసుకువెళ్తోంది. ప్రాజెక్టు పురోగతిపై నిరంతరం క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నాం. ఇప్పటికే ఏపీ గ్రీనింగ్ అండ్ క్లైమేట్ ఛేంజ్ మిటిగేషన్ సొసైటీ ద్వారా గ్రీన్ వాల్ లక్ష్య సాధన దిశగా అన్ని శాఖలను సమన్వయం చేస్తున్నామ”న్నారు

# పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటిని విడుదల చేయాలి.

**● వెలుగోడు, గోరుకల్లు, అవుకు రిజర్వాయర్లు నింపాలి. ● ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్.**

రుద్రవరం. పల్లె వెలుగు : శ్రీశైలం రిజర్వాయర్ నీటిమట్టం నేటి సాయంత్రానికి 855 అడుగులు చేరుతున్నందువల్ల రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని రాయలసీమ ప్రాంత రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటిని వదిలి జిల్లాలోని మొత్తం తాగునీటి ప్రాజెక్టులను చెరువులను నింపాలని, తెలుగు గంగ, కేసీ కెనాల్, ఎస్ ఆర్ బి సి ప్రాజెక్టుల ద్వారా, మల్యాల ఎత్తిపోతలపథకాల ద్వారా వెంటనే నీరు విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి. రామచంద్రుడు, జిల్లా నాయకులు శంకరయ్య, రుద్రవరం మండల అధ్యక్షుడు గురెడ్డి, రైతులు నాగేంద్రుడు, రవి తదితరులు కోరారు. సోమవారం టి . రామచంద్రుడు మాట్లాడుతూ కృష్ణానది ఎగువ ప్రాంతాన కురుస్తున్న వర్షాల వల్ల భారీగా వరద నీరు వచ్చి చేరుకున్నందువల్ల, శ్రీశైలం రిజర్వాయర్ నీటిమట్టం నేటికీ 855 అడుగులకు చేరుతుందని, బచావత్ ట్రిబునల్ తీర్పు ప్రకారం శ్రీశైలం రిజర్వాయర్ నీటిమట్టం 855 అడుగులకు వచ్చినప్పుడు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుండి నీటిని విడుదల చేసుకోవడానికి ఉన్న హక్కును ఉపయోగించుకుని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నీటిని విడుదల చేయాలని కోరారు. ఇప్పటికే జిల్లాల్లో వివిధ మండలాలలో ఖరీఫ్ లో వేసిన పంటలు ఎండిపోయి రైతాంగం దున్నేస్తున్నారని, ఫలితంగా రైతాంగం తీవ్రంగా



నష్టపోతున్నారు. మరిన్ని పంటలు చావు బతుకుల మధ్య కొట్టుమిట్లాడుతున్నాయి. దీనివల్ల అధికారులు అలసత్వం చేయకుండా వెంటనే పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని వదిలి నంద్యాల జిల్లా రైతాంగానికి మేలు చేయాలని కోరుతూ, తమ విన్నపాన్ని జిల్లా కలెక్టర్ ద్వారా ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ రుద్రవరం తహసిల్దార్ గారికి వినతి పత్రం సమర్పించారు ఈ కార్యక్రమంలో రైతులు శ్రీనివాసులు, మద్దిలేటి, పుల్లయ్యతో పాటు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

**చిన్న కంబాలూరు దళితుల స్మశానం కోసం స్థలం కేటాయించాలి.**

రుద్రవరం మండలం, చిన్న కంబాలూరు గ్రామంలోని మాల ,మాదిగ కులాలకు చెందిన దళితులకు స్మశానం కోసం అవసరమైన స్థలాన్ని కేటాయించి, మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ రుద్రవరం తాసిల్దార్ గారికి కెవిపిఎస్, రైతు సంఘం నాయకులు, దళితులు కలసి వినతి పత్రం సమర్పించారు. ఎన్నో సంవత్సరాల నుండి స్మశాన స్థలం లేక పంట పొలాలకు వెళ్ళు దారికి ఇరువైపులా గల గుంతల్లో, పొలం గట్లపై రెండు కులాల వారు తమ వారు చనిపోతే పూడ్చుకొని దుస్థితి ఉన్నదని, తాసిల్దారు గారు వెంటనే జోక్యం చేసుకొని స్మశానం కోసం తాము పడుతున్న ఇబ్బందుల్ని ప్రత్యక్షంగా పరిశీలించి, తమ గ్రామంలో కొంత స్థలాన్ని స్మశానం కోసం కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా తాసిల్దార్ గారు తాను పరిశీలిస్తానని, అయితే గ్రామంలో ఖాళీగా ఉన్న స్థలాన్ని సూచించాలని, ఎవరైనా ఇవ్వడానికి ముందు వచ్చే వారి పేర్లను సూచిస్తే మేము కూడా వెళ్లి మాట్లాడుతామని, దళితులకు కచ్చితంగా న్యాయం జరిగేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి టి. రామ చంద్రుడు, కెవిపిఎస్ గంగయ్య, మద్దిలేటి, నరసింహుడు, రవి తో పాటు దళితులు పాల్గొన్నారు

# నాడు టైటానిక్ లో ప్రయాణికులు ఏం తిన్నారు?

*(మొదటి పేజీ తరువాయి)*

నౌక ఒక తేలియాడే విలాసవంతమైన భవంతి. ముఖ్యంగా అందులో కల్పించిన భోజన సదుపాయాలు ప్రయాణికుల తరగతిని బట్టి ఎంతో వైవిధ్యంగా ఉండేవి. వందేళ్ల తర్వాత లభించిన ఆనాటి మెనూ కార్డుల ద్వారా పలు ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఫస్ట్ క్లాస్ ప్రయాణికులకు అందించిన భోజనం యూరప్‌లోని అత్యుత్తమ లగ్జరీ హోటళ్లతో సమానంగా ఉండేది. ఇందులో ఫ్రెంచ్ వంటకాలకు అధిక ప్రాధాన్యతనిచ్చేవారు. ఓడ మునిగిపోవడానికి కొన్ని గంటల ముందు, అంటే ఏప్రిల్ 14 రాత్రి జరిగిన విందులో ఆయిస్టర్స్, పాచ్డ్ సాల్మన్, ఫిలె మిన్యాన్, రోస్ట్ డక్లింగ్ వంటి అనేక రకాల వంటకాలను వడ్డించారు. డెజర్ట్‌లలో ఫ్రెంచ్ ఐస్‌క్రీమ్, ఎక్లెయిర్స్ వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సెకండ్ క్లాస్ ప్రయాణికులకు కూడా నాటి ప్రమాణాలకు అనుగుణంగా అత్యంత నాణ్యమైన ఆహారాన్ని అందించేవారు. రోస్ట్ బీఫ్, చికెన్, బేక్డ్ ఫిష్ వంటివి వీరి మెనూలో ఉండేవి. ఇక అత్యంత ఆశ్చర్యకరమైన విషయం థర్డ్ క్లాస్ భోజన సదుపాయం. ఆ రోజుల్లో చాలా నౌకల్లో థర్డ్ క్లాస్ ప్రయాణికులు తమ ఆహారాన్ని తామే సమకూర్చుకోవాల్సి వచ్చేది. కానీ టైటానిక్‌లో టికెట్ ధరలోనే భోజన వసతిని కల్పించారు. వారికి ఓట్‌మీల్, గుడ్లు, రోస్ట్ బీఫ్ వంటి పోషకాహారాన్ని వడ్డించేవారు. దాదాపు 2,200 మంది ప్రయాణికులు, సిబ్బందికి ఆహారం సిద్ధం చేసేందుకు నౌకలో భారీ వంటశాల ఉండేది. ఇందులో 19 ఓవెన్లతో కూడిన రెండు అతిపెద్ద వంటగదులు ఉండటం విశేషం. ప్రమాదం నుంచి లభించిన ఆనాటి మెనూ కార్డులు ప్రస్తుతం అమూల్యమైన చారిత్రక సంపదగా మిగిలాయి.

# కోర్టులో లొంగిపోయిన తమ్మినేని కుమారుడు.. బెయిల్ మంజూరు

*(మొదటి పేజీ తరువాయి)*

శ్రీకాకుళం జిల్లా చాపరం భూకబ్జా కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ స్పీకర్, వైసీపీ సీనియర్ నేత తమ్మినేని సీతారాం కుమారుడు వెంకట చిరంజీవి నాగ్ సోమవారం శ్రీకాకుళం కోర్టులో లొంగిపోయారు. విచారణ సందర్భంగా ఆయనకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. భూ కబ్జా ఆరోపణలకు సంబంధించిన కేసులో చిరంజీవి నాగ్‌ను ఏ5 (5వ నిందితుడు)గా చేర్చారు. ఈ క్రమంలో సోమవారం ఆయన కోర్టు ఎదుట హాజరయ్యారు. విచారణ సమయంలో, తన ఆరోగ్య పరిస్థితిని చిరంజీవి నాగ్ కోర్టుకు వివరించారు. ఆయన వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అనంతరం, ఈ నెల 10వ తేదీన జరిగే తదుపరి విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని చిరంజీవి నాగ్‌ను కోర్టు ఆదేశించింది. ఇదే కేసులో చిరంజీవి నాగ్ తండ్రి తమ్మినేని సీతారాం ఏ6 (6వ నిందితుడు)గా, ఆయన తల్లి వాణిశ్రీ ఏ7 (7వ నిందితురాలు)గా ఉన్నారు. ఒకే కేసులో మాజీ స్పీకర్ కుటుంబ సభ్యులు ముగ్గురూ నిందితులుగా ఉండటం గమనార్హం.

# భారత ఐటీ రంగానికి కొత్త హెచ్చరిక..

*(మొదటి పేజీ తరువాయి)*

దాదాపు పదేళ్లుగా కొనసాగుతున్న ఈ ఒప్పందం విలువ గతంలో ఏటా సుమారు 20 కోట్ల డాలర్లుగా ఉండేది. ఇప్పుడు దాని పరిధిని కుదించడంతో హెచ్‌సీఎల్‌టెక్‌కు వచ్చే వార్షిక ఆదాయంలో 5 కోట్ల డాలర్ల తగ్గుదల ఉండొచ్చని అంచనా. ఇది కంపెనీ మొత్తం వార్షిక ఆదాయంలో సుమారు 0.3 శాతం మాత్రమే. ఈ నిర్ణయం వల్ల భారీ స్థాయిలో ఉద్యోగాల కోత ఉండదని సమాచారం. గూగుల్ ప్రాజెక్టుపై పనిచేస్తున్న దాదాపు వెయ్యి మంది హెచ్‌సీఎల్‌టెక్ ఉద్యోగులను ఇతర ప్రాజెక్టులకు మార్చనున్నట్లు తెలుస్తోంది. ఏఐ, క్లౌడ్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌కు సంబంధించిన కొత్త పనుల్లో వీరిని వినియోగించే అవకాశం ఉంది. నైపుణ్యం కలిగిన సిబ్బందిని కొనసాగిస్తూ అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టులు మార్చడం ఐటీ రంగంలో పెరుగుతున్న ధోరణిగా నిపుణులు చెబుతున్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి విషయంలో అది అత్యంత బాధాకరం: కేటీఆర్

సివిల్ సప్లైస్ స్కామ్‌తో పాటు విద్యాశాఖలోని బంకర్ బెడ్స్ కుంభకోణాన్ని ఆధారాలతో సహా బయటపెట్టారని చెప్పారు. ఆ ఆధారాలను ఈడీ కార్యాలయానికి అందజేయడమే కాకుండా సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించారని తెలిపారు. అయితే, సుదర్శన్ రెడ్డి మరణించిన మరునాడే సుప్రీంకోర్టు నుంచి నోటీసులు జారీ అవుతూ గైడెన్స్ రావడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలోని వ్యక్తులు ఆయన విమర్శలను తట్టుకోలేక, అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లను ప్రధాని మోదీ నిలిపివేసారని సీఎం రేవంత్ రెడ్డి బుకాయిస్తున్నారని, ఆయన చేసిన తీర్మానం కేవలం ఒక చిత్తు కాగితమని కొట్టిపారేశారు. సోనియా గాంధీ తెచ్చిన విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారా అని ప్రశ్నించారు. గురుకులాల్లో 150 మంది విద్యార్థులు చనిపోవడం, 7 వేల ఐటీ ఉద్యోగాలు పోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. గోదావరిలో నీళ్లు సముద్రం పాలు అవుతున్నా రైతాంగానికి నీళ్లందించకుండా ఎండబెడుతున్నారని మండిపడ్డారు. పంపింగ్ ద్వారా నీళ్లు మిడ్ మానేరుకు ఎలా వస్తున్నాయో తెలియని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, హెలికాప్టర్లలో వెళ్లి పోజులు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. మెట్రో ప్రాజెక్టును ప్రభుత్వం టేకోవర్ చేయడం వెనుక రూ.200 కోట్లు కొల్లగొట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు వేసిన స్కెచ్ ఉందని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేసే కుట్రలు సాగుతున్నాయని అన్నారు.

# “మిస్టర్ డ్రామారావు” అంటూ కేటీఆర్ పై మంత్రి పొంగులేటి ఫైర్

పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, ఉద్యమకారుడైన పెద్ది సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించిందని పొంగులేటి ఆరోపించారు. ఎమ్మెల్యేగా ఓటమి పాలైన తర్వాత ఆయనకు కనీసం రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ పదవి అయినా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. సంతోష్ రావు, దామోదర్ రావు వంటి వారికి పదవులు కట్టబెట్టిన బీఆర్ఎస్ నాయకత్వం, పెద్ది సుదర్శన్ రెడ్డిని ఎందుకు విస్మరించిందని ఆయన ప్రశ్నించారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ది సుదర్శన్ రెడ్డిని వైద్య చికిత్స కోసం వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసిందని, ఆయన అంత్యక్రియలను అధికారిక పోలీసు లాంఛనాలతో నిర్వహించి గౌరవించిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తుచేశారు. ఉద్యమకారులను కేవలం ఓట్ల కోసం వాడుకుని, అధికారం, కీలక పదవులన్నీ కల్వకుంట్ల కుటుంబమే అనుభవించడం బీఆర్ఎస్‌కు అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. మరణాలను సైతం రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్న బీఆర్ఎస్ పార్టీకి రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు మరోసారి గుణపాఠం చెప్పడం ఖాయమని పొంగులేటి ధ్వజమెత్తారు.

# తాగునీటి ఎద్దడి సమస్యపై దృష్టి పెట్టండి

ల్యాబ్ టెస్టుల నివేదికలను విడుదల చేయాలని సూచించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి... అంగన్వాడీ కేంద్రాలను తనిఖీలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రవాణ శాఖలో పూర్తి స్థాయి టెక్నాలజీ వినియోగం, అనవసర నిబంధనల తొలగింపు వంటి అంశాలకు తీసుకుంటున్న చర్యలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. 24 గంటల్లో డీమ్డ్ రిజిస్ట్రేషన్ విధానం, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్, ఫారం-5దీ వంటి పరీక్షలను తొలగించడం వంటి చర్యల ద్వారా అవినీతిని తగ్గించడం, సులభతర సేవలను అందించే అవకాశం కలుగుతుందని అధికారులు చెప్పారు. దశలవారీగా రవాణా శాఖలో ఈ సంస్కరణలు చేపట్టేలా తాము ప్రణాళికను సిద్ధం చేశామని తెలిపారు. వీలైనంత మేరకు అనవసర నిబంధనలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కల్లూరులో '2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి -- సంక్షేమం' కార్యక్రమం

- ఇంటింటికీ సంక్షేమ పథకాలు వివరిస్తూ కరపత్రాల పంపిణీ
- ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్ కమ్మరి పార్వతమ్మ





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామాలు, వార్డుల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగుతోందని ఏపీ విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ అన్నారు. సోమవారం కల్లూరు మండలం 41వ వార్డు, 81వ బూత్ పరిధిలోని సన్ రైజ్ స్కూల్ లైన్ లో '2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి -- సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా ఆమె విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనతో పాటు నాణ్యమైన వైద్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 37వ వార్డు ఇన్చార్జి సుతారు రాఘవేంద్ర, క్లస్టర్ కో కన్వీనర్ కాసాని మహేష్ గౌడ్, 45వ యూనిట్ ఇన్చార్జ్ ధనుంజయ, సీనియర్ కార్యకర్త ఇమ్మానియేల్, యూనిట్ ఇన్చార్జి ఖాదర్ వలి, బూత్ ఇన్చార్జిలు బాలకృష్ణ, సుబ్బరాయుడు, వెంకటేష్, అనిల్, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికి సీఎంఆర్ఎఫ్ వరం: పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో అత్యవసర వైద్య చికిత్సలు పొందుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఒక అభయహస్తంలా, గొప్ప వరంలా




నిలుస్తుందని పాణ్యం శాసనసభ్యురాలు, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గౌరు చరిత రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం పాణ్యం నియోజకవర్గానికి చెందిన 45 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 30,61,789/- విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే శ్రీమతి గౌరు చరిత రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నిరుపేదలు ఆస్పత్రి ఖర్చుల భారం నుంచి ఉపశమనం పొందేలా ప్రభుత్వం వేగంగా సహాయాన్ని అందిస్తోందన్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం దరఖాస్తు చేసుకున్న ప్రతి పేదవాడికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందించేలా కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం నుంచి తక్షణమే సహాయం అందడంపై లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డికు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష




మహానంది, పల్లె వెలుగు తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసిడిఎస్ సూపర్వైజర్ తోట కవిత పేర్కొన్నారు.సోమవారం మహానందిలోని హెల్త్ సబ్ సెంటర్లో ప్రపంచ తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారమని, వ్యాధులు రాకుండా రక్షిస్తాయి అన్నారు. పుట్టిన గంటలోపు శిశువుకు తల్లి పాలు ఇవ్వడం ద్వారా ఆరోగ్యానికి బలమైన పునాది ఏర్పడుతుందన్నారు. మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే ఇవ్వాలని, తద్వారా అస్తమా, ఎలర్జీ, ఇమ్యూనిటీ లోపం, బీపీ, బ్లడ్క్యాన్సర్, డయాబెటిస్, ఎదుగుదల లోపం వంటి రుగ్మతల నుంచి బిడ్డను కాపాడవచ్చు అన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు,బాలింతలు పాల్గొన్నారు.

# "సమాజ సంస్కరణకు రచయితలు కలాలు కదిలించాలి.

**ఈ పవిత్ర బాధ్యతకు ముస్లిం కవులు ముందు వరుసలో ఉండాలి".**
**ముస్లిం రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమద్.**






పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నేటి సాంకేతిక, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ తీవ్ర పరిణామాలలో అడుగంటి పోతున్న నైతిక విలువలు నిలబెట్టి, సమాజ సంస్కరణలో సాహితివేత్తలు రచయితలు తమకలాలను కదిలించాలని, ముస్లిం కవులు ఈ పవిత్ర బాధ్యత నగరవేర్చుటలో ముందువరుసలో ఉండాలని, ముస్లిం రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమద్ పిలుపు నిచ్చారు. నంద్యాల జిల్లా మురసం అధ్యక్షులు యం.యండి. రఫీ అధ్యకతన స్థానిక నవభారత్ హైస్కూల్ లో జరిగిన సంఘ వార్షిక సమావేశంలో సమద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్వాతంత్ర్యోద్యమంలో కవుల, రచయితల పాత్ర కీలకంగా ఉంటుందని, ముస్లీం రచయితలు తమ కలాలను తమ రక్తంతో, శ్వేదంతో నింపి స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారని, ఆ స్ఫూర్తి ప్రతి రచయితా మననం చేసుకోవాలని కోరారు. అధ్యక్షులు రుషి తమ నివేదికలో గత రెండు సంవత్సరాల్లో నంద్యాల ముస్లిం చేసిన సేవలు, సదస్సులు, కవి సమ్మేళనాలు, పుస్తకావిష్కరణలు, ప్రముఖుల జయంతి, వర్ధంతులు వివరించారు. ప్రధాన కార్యదర్శి మహబూబ్ బాషా కన్వినర్ గా సమావేశాన్ని రక్తి కలిగించారు. సమావేశంలో పాల్గొన్న కవులు అబ్దుల్ అజీజ్, హాఫీజ్ సలీం పర్వేజ్, సయ్యద్ జమీలుద్దీన్, అబ్దుల్ వహాబ్, అమ్జద్ షరీఫ్, మద్దుర్ యం.డి.రఫీ, అబ్దుల్ రెహమాన్ తదితరులు ప్రసంగించారు. ప్రవక్త ముహమ్మద్ (స) జన్మదిన వేడుకలు సంధర్భంగా నంద్యాల జిల్లా మురసం ఆధ్వర్యంలో కవి సమ్మేళనం (ముషాయిరా) నిర్వహించాలని, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుల, రచయితల దినోత్సవాలు నిర్వహించాలని, రచనలపై ఓ శిక్షణా శిబిరం నిర్వహించాలని తీర్మానించారు. అనంతరం 2026-2029 సంవత్సరాల కోసం ఈక్రింది నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకోబడింది.

**ముస్లిం రచయితల సంఘం**

నంద్యాల జిల్లా మురసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ సమద్ పర్యవేక్షణలో 2027-2029 సం. ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గం.. గౌరవ అధ్యక్షులు: నవభారత్ ముహమ్మద్ హుసేన్. అధ్యక్షులు: యం. యండి. రఫీ, బలపనూరు ఉపాధ్యక్షులు: సి. అబ్దుల్ అజీజ్. ప్రధాన కార్యదర్శి. ఎస్.మహబూబ్ బాషా సహాయ కార్యదర్శి: ఎస్ హుస్సేన్ భాష, అయ్యలూరు ఆర్గనైజింగ్ కార్యదర్శి: యం.యం.డి రఫీ,మద్దూరు. కోశాధికారి: ఎస్.అబ్దుల్ వహాబ్ . కార్యవర్గ సభ్యులు: 1.హాఫీజ్ ముహమ్మద్ సలీం పర్వేజ్ 2.సయ్యద్ జమీలుద్దీన్ 3.వి.అబ్దుల్ రెహమాన్ 4.అమ్జద్ షరీఫ్ 5.ముల్లా ముహమ్మద్ రఫీ 7.ఎస్.సలీం బాష, వేల్పనూరు 8.పి.అయూబ్ ఖాన్ 9.ఫజ్లుర్రహమాన్ 10.పర్వేజ్ 11.సి.ఇర్ఫాన్ బాషా 12.ఎస్.ఏ.కలీం, పోలూరు కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోబడినట్లు అబ్దుల్ సమద్ తెలిపారు.

# పారిశుద్ధ్య కార్మికుల భవిష్యనిధి, ఉద్యోగుల రాష్ట్ర బీమా బకాయిలు వెంటనే జమ చేయాలి

**- వారానికి ఒక రోజు తప్పనిసరిగా విశ్రాంతి దినం కల్పించాలని ప్రజావాణిలో వినతిలి**



కీసర, ఆగస్టు 3 (పల్లె వెలుగు): కీసర డివిజన్--1 పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల జీతాల నుంచి కోత విధిస్తున్న భవిష్యనిధి, ఉద్యోగుల రాష్ట్ర బీమా సొమ్మును వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని, అలాగే ప్రతి వారానికి ఒక రోజు తప్పనిసరిగా విశ్రాంతి దినం కల్పించాలని కీసర మండల సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్ ప్రజావాణిలో పురపాలక సంఘ కమిషనర్కు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం... గ్రామపంచాయతీ నుంచి దమ్మాయిగూడ పురపాలక సంఘంలో విలీనమైన తరువాత గత రెండేళ్లుగా పారిశుద్ధ్య కార్మికుల జీతాల నుంచి భవిష్యనిధి, ఉద్యోగుల రాష్ట్ర బీమా పేరుతో కోతలు విధిస్తున్నప్పటికీ, ఆ సొమ్ము వారి ఖాతాల్లో జమ కాలేదని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి, పెండింగ్లో ఉన్న మొత్తాన్ని వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే భవిష్యనిధి, ఉద్యోగుల రాష్ట్ర బీమా



పథకాలు, వైద్య సేవలు పొందే విధానం, దరఖాస్తు ప్రక్రియ, అవసరమైన ధ్రువపత్రాలు, కార్మికులకు లభించే సంక్షేమ ప్రయోజనాలపై పూర్తి అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం సంబంధిత అధికారులు, ఆరోగ్యశాఖ సిబ్బందితో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అదేవిధంగా రాష్ట్ర వేతన నియమావళి ప్రకారం ప్రతి ఉద్యోగికి వారానికి ఒక రోజు విశ్రాంతి కల్పించాల్సిన నిబంధన ఉన్నందున, పారిశుద్ధ్య కార్మికులకు కూడా వారానికి కనీసం ఒక రోజు సెలవు అమలు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీంతో పని ఒత్తిడి తగ్గి వారి ఆరోగ్యం, కుటుంబ జీవితం మెరుగుపడుతుందని తెలిపారు.

# కరివెన జెడ్పీ హైస్కూల్లో శక్తి యాప్, మహిళల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన.

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా





పోలీసు సూపరింటెండెంట్ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాలమేరకు, ఆత్మకూరు డీఎస్పీ ఆర్. రామాంజి నాయక్ సూచనలతో ఆత్మకూరు ఇన్స్పెక్టర్ మహేశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్ శక్తి టీమ్ బృందం ఆధ్వర్యంలో కరివెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థినీ, విద్యార్థులకు శక్తి యాప్, మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, రోడ్డు భద్రత అంశాలపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కోసం ప్రవేశపెట్టిన శక్తి యాప్ ప్రాముఖ్యతను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్ను ఎలా ఉపయోగించాలి, శక్తి యాప్ వాట్సాప్ నంబర్ 7993485111 ద్వారా ఎలా సహాయం పొందవచ్చో వివరించారు. మహిళలు, బాలికలు వేధింపులు, ఈవ్టీజింగ్ లేదా ఇతర నేరాలకు గురైనప్పుడు భయపడకుండా వెంటనే 112కు కాల్ చేయడం లేదా శక్తి యాప్ ద్వారా పోలీసులను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధం, బాలలపై జరిగే నేరాల నివారణ, 1098 చైల్డ్ హెల్ప్లైన్ సేవలపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు వివాహాలు చేయడం చట్టవిరుద్ధమని, అలాంటి సంఘటనలు తెలిసిన వెంటనే 1098 లేదా 112కు సమాచారం అందించాలని తెలిపారు.

సైబర్ నేరాలపై మాట్లాడుతూ ఫేక్ కాల్స్, నకిలీ లింకులు, ఏపీకే ఫైళ్లు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎవరికీ ఇవ్వకూడదని హెచ్చరించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్లైన్కు ఫిర్యాదు చేయాలని, అలాగే ఉమెన్ హెల్ప్లైన్--181, పోలీస్ ఎమర్జెన్సీ--112, 100 సేవలను అవసరమైనప్పుడు వినియోగించాలని సూచించారు. మహిళలకు అందుబాటులో ఉన్న వన్ స్టాప్ సెంటర్ సేవల గురించి కూడా వివరించారు.

రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ 18 సంవత్సరాల లోపు మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ మోటార్ సైకిళ్లు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై భారీ జరిమానాలు, జైలు శిక్షలు విధించే అవకాశం ఉందని తెలిపారు.

అదేవిధంగా విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవిస్తూ క్రమశిక్షణతో చదువుకోవాలని, విద్యే జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లే శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.ఎస్. సనావుల్లా ,ఇన్చార్జి హెచ్ఎం రామిరెడ్డి, ఉపాధ్యాయులు ఇబ్రాహీం, శక్తి టీమ్ బృందం ఏ ఎస్ ఐ షేక్ నూర్ అహమ్మద్, మహిళా హోంగార్డు సుప్రియ, కరివెన సచివాలయం జి ఎం ఎస్ కె నాగలక్ష్మి పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

# నంద్యాల మండలం కానాల గ్రామంలో ఇంటింటికీ చంద్రన్న సంక్షేమం.

## ప్రజల ముంగిటకు కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు -- మంత్రి ఎన్ఎండి ఫరూక్.





పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల మండలం కానాల గ్రామంలో గ్రామ టిడిపి నాయకుల ఆధ్వర్యంలో జరిగిన "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు . ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో రూపొందించిన కరపత్రాలను ప్రజలకు అందజేస్తూ, వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం ద్వారా ప్రజలతో నేరుగా మమేకమై, చంద్రన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి ఎలా చేరుతున్నాయో తెలుసుకోవడంతో పాటు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. యువత భవిష్యత్తు, పేదల సంక్షేమం, మహిళల సాధికారత, విద్య, ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. చంద్రన్న సంక్షేమ పాలనపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కి నంద్యాల ప్రజలు తమ పూర్తి మద్దతు తెలియజేస్తున్నారని అన్నారు .

ఈ కార్యక్రమంలో నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పిట్టల మదర్సా , సొసైటీ డైరెక్టర్ బాలమదిలేటి, మాజీ సర్పంచ్ పిడి ఉసేని, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బాబు, మండల జనరల్ సెక్రెటరీ పిట్టల అనీఫ్, బుగ్గ రామేశ్వరం టెంపుల్ చైర్మన్ కిరణ్ కుమార్ రెడ్డి, విజయ శేఖర్ రెడ్డి, ప్రదీప్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సాయిబాబా, ఉప్పు వెంకటేశ్వర్లు, మెహతాబ్, శ్రీనివాసులు, ప్రేమ్ నాథ్ రెడ్డి, నంద్యాల మండల టిడిపి కన్వీనర్ మునగాల విశ్వనాథ్ రెడ్డి, జిల్లా పార్టీ సెక్రటరీ రాజేష్ (బుజ్జి), పోలూరు సొసైటీ చైర్మన్ చంద్రమౌళి రెడ్డి , వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# కరువు కోరల్లో రాయలసీమ...

## శ్రీశైలం ప్రాజెక్టు జల సంరక్షణపై తక్షణ చర్యలు చేపట్టాలి.

**☛ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి జలవనరుల శాఖ కర్నూలు చీఫ్ ఇంజనీర్ ద్వారా రాయలసీమ సాగునీటి సాధన సమితి విజ్ఞప్తి.**

**☛"శ్రీశైలం ప్రాజెక్టులో సంరక్షించే ప్రతి టీఎంసీ... రాయలసీమ తాగునీటి భద్రతకు, రైతాంగ మనుగడకు శ్రీరామరక్ష."**

**☛బొజ్జా దశరథ రామిరెడ్డి, అధ్యక్షులు, రాయలసీమ సాగునీటి సాధన సమితి.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్న రాయలసీమలో తాగునీరు, పశువుల తాగునీరు, ఆరుతడి పంటలకు కనీస లైఫ్ సేవింగ్ ఇరిగేషన్ అందించేందుకు శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణలో జల సంరక్షణకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, కర్నూలు జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేసింది. సోమవారం నంద్యాల సమితి కార్యాలయంలో ఈ మేరకు బొజ్జా దశరథరామిరెడ్డి ప్రకటన విడుదల చేసారు. ఈ సందర్భంగా బొజ్జా మాట్లాడుతూ.. కృష్ణా జలాల నిర్వహణలో శ్రీశైలం జలాశయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుత కరువు పరిస్థితుల్లో జాతీయ జల విధానం, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం--2014, బచావత్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలు, శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ నియమావళి ప్రకారం తాగునీటికి మొదటి ప్రాధాన్యం ఇవ్వడం, తదుపరి పశువుల తాగునీరు, అనంతరం ఆరుతడి పంటలకు కనీస లైఫ్ సేవింగ్ ఇరిగేషన్ అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు.

గత వర్షాకాలంలో శ్రీశైలం జలాశయానికి 2,000 టీఎంసీలకు పైగా వరద జలాలు వచ్చినప్పటికీ, విద్యుత్ ఉత్పత్తి పేరుతో పెద్దఎత్తున నీటిని దిగువకు విడుదల చేయడం వల్ల జల సంరక్షణకు భంగం కలిగిందని, దాని ప్రభావమే ప్రస్తుతం రాయలసీమ ఎదుర్కొంటున్న తీవ్రమైన తాగునీటి, సాగునీటి సంక్షోభానికి ప్రధాన కారణమని అన్నారు.

### ప్రాధాన్యతగా చేపట్టాల్సిన కార్యాచరణ

ప్రస్తుత కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ఈ చర్యలు చేపట్టాలని సమితి కోరింది. 1.) మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా హంద్రీ--నీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు వెంటనే నీటిని పంపింగ్ చేయాలి. 2.) పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా ఎస్ఆర్బీసీ, కేసీ కెనాల్, తెలుగు గంగ, గాలేరు--నగరి ప్రాజెక్టుల పరిధిలోని రిజర్వాయర్లు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, గ్రామీణ చెరువులకు తక్షణమే నీటిని విడుదల చేయాలి. 3.) తాగునీరు, పశువుల తాగునీరు, ఆరుతడి పంటలకు అవసరమైన కనీస లైఫ్ సేవింగ్ ఇరిగేషన్ అందేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలి.

### కృష్ణా డెల్టాకు ప్రత్యామ్నాయాలు... శ్రీశైలానికి జల సంరక్షణ

కృష్ణా డెల్టా అవసరాల కోసం పట్టిసీమ, పులిచింతల వంటి ప్రత్యామ్నాయ నీటి వనరులను గరిష్ఠ స్థాయిలో వినియోగిస్తూ, శ్రీశైలం జలాశయం నుంచి అనవసర నీటి విడుదలను తగ్గించాలని సమితి సూచించింది. ప్రతి టీఎంసీ నీటిని భవిష్యత్ తాగునీటి అవసరాలు, కరువు పరిస్థితులు, రాయలసీమకు చట్టబద్ధంగా కేటాయించిన జలహక్కులను దృష్టిలో ఉంచుకుని శాస్త్రీయంగా నిర్వహించాలని కోరింది.

### ప్రాంతీయ న్యాయం కోసం జల సంరక్షణే మార్గం

రాయలసీమ ప్రజల తాగునీటి భద్రత, పశుసంపద పరిరక్షణ, రైతుల జీవనోపాధి రక్షణ రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత బాధ్యత అని సమితి పేర్కొంది. అందువల్ల "శ్రీశైలం జల నిర్వహణలో జల సంరక్షణే ప్రధాన విధానం" అనే సూత్రాన్ని ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని బొజ్జా విజ్ఞప్తి చేసారు "ఈరోజు శ్రీశైలంలో సంరక్షించే ప్రతి టీఎంసీ నీరు రేపటి రాయలసీమ తాగునీటి భద్రతకు, రైతాంగ మనుగడకు, పశుసంపద రక్షణకు, ప్రాంతీయ న్యాయానికి భరోసా అవుతుంది. అందువల్ల కృష్ణా డెల్టాకు ప్రత్యామ్నాయ నీటి వనరులను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ, శ్రీశైలం జలాశయంలో గరిష్ఠ స్థాయిలో జల సంరక్షణ చేపట్టే విధానాన్ని ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలి" అని బొజ్జా దశరథ రామిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

# కానాల గ్రామంలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం.






పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల మండలం కానాల గ్రామంలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ ముఖ్యఅతిథిగా హాజరై అర్హులైన రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. రైతులకు భూ హక్కులకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తూ, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వ సేవలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు.

ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా , నంద్యాల ఎం.ఆర్.ఓ. శ్రీవాణి , నంద్యాల ఎం.డి.ఓ. , కానాల గ్రామ పంచాయతీ కార్యదర్శి , గ్రామ పంచాయతీ మరియు సచివాలయ సిబ్బంది, నంద్యాల మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పిట్టల హనీఫ్ , ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ (టీడీపీ) లీగల్ సెల్ కార్యదర్శి శ్రీ పీడీహెచ్ బాబు గారు, నంద్యాల మార్కెట్ యార్డు చైర్మన్ జి. హరిబాబు , తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మార్కెట్ యార్డు డైరెక్టర్ పిట్టల మదార్ సా , కానాల గ్రామ మాజీ సర్పంచ్ పి.డి. హుస్సేన్ , తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పి. బాల మద్దిలేట్టి , నంద్యాల తెలుగుదేశం ఉపాధ్యక్షులు దూదేకుల దస్తగిరి , ఆంధ్రప్రదేశ్ నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాస్ , నంద్యాల మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డి , తెలుగుదేశం నాయకులు బి. ప్రదీప్ కుమార్ రెడ్డి , తోట జగన్నాథ్ , హజరత్ కరీముల్లా , గౌరీ గల్లా నాయికుమార్ , పి. లతీఫ్ బాషా , పి.డి. శేఖర్ , పి. బాషా , సి. నాగరాజు , సిరిగిరి రవి , ఎల్ఐసీ కరీం బాషా , వార్డు ఇన్‌చార్జ్‌లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పంచాయతీ మరియు సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆచరణాత్మక బోధనకు అత్యంత ప్రాధాన్యత: ప్రిన్సిపాల్

మహానంది, పల్లె వెలుగు ఆధునిక విద్యలో ఆచరణాత్మక బోధనకు అత్యంత ప్రాధాన్యత ఉందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మణరావు పేర్కొన్నారు. సోమవారం మహానంది





మండలం తిమ్మాపురం ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ విద్యార్థులు వృత్తి విద్యా కోర్సులో భాగంగా 'ప్రత్యక్ష అనుభవ బోధన' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులు సమీపంలోని వరి పొలాలను సందర్శించి, స్వయంగా బురద పొలాల్లోకి దిగి వరి నాట్లు వేశారు.ప్రిన్సిపాల్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. వృత్తి విద్య ద్వారా విద్యార్థులకు స్వయం సమృద్ధి, ఆచరణాత్మక నైపుణ్యాలు సిద్ధిస్తాయన్నారు. రైతుల శ్రమను, ఆహార ఉత్పత్తి వెనుక ఉన్న కష్టాన్ని విద్యార్థులు చిన్నతనం నుంచే అర్థం చేసుకోవడం వారి వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో తోడ్పడుతుందని పేర్కొన్నారు. తరగతి గదులలో బోధించే సైద్ధాంతిక పాఠ్యాంశాలను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా, విద్యార్థులకు ఆచరణాత్మక జ్ఞానాన్ని అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు.వృత్తి విద్యా రంగానికి చెందిన నైపుణ్య శిక్షకులు శ్రీకళ, సోనిల పర్యవేక్షణలో 50 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# ఖాళీ ఎం.ఎల్.సి స్థానం వడ్డెరలకు కేటాయించాలి.

పల్లె వెలుగు నంద్యాల రూరల్ నంద్యాల కాళీ ఎమ్మెల్సీ స్థానం వడ్డెరలకు కేటాయించాలని



ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంఘం నాయకుడు చెల్లా వెంకటేష్ అన్నారు. 10% రిజర్వేషన్ ఎస్ టి హోదా మైనింగ్ జీవో సవరణ కోరిన చల్లా వెంకటేష్ ఆంధ్ర ప్రదేశ్ వడ్డెర సంఘం సూర్యవంశ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం ఖాళీ అవు తున్న రెండు ఎమ్మెల్సీ స్థానాలలో ఒక స్థానాన్ని వడ్డెర సామాజిక వర్గానికి కేటాయించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో దాదాపు 40 లక్షల జనాభా ఉన్న వడ్డెరలకు చట్టసభలో తగిన ప్రతినిత్యం లేదని అన్నారు. 5 దశాబ్దాలుగా ఆర్థి కంగా రాజకీయమ గా వెనుకబడి ఉన్నామని అన్నారు. సెప్టెంబర్ 2 నుండి ప్రారంభమయ్యే స్థానిక స్థలం ఎన్నికల్లో ఎంపీటీసీ , జెడ్పీటీసీ సర్పంచు కార్పొరేటర్ పదవుల్లో వడ్డెరులకు 10 శాతం స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. మేమెంతో మాకు అంత అనే ప్రతిపాదికన ప్రతినిత్యం కలిగించాలని కోరారు. రాజధాని అమరావతిలో తొలి స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జ్ఞాపకార్థం పది ఎకరాలు విశీర్ణంలో శృతి వనం ఏర్పాటు చేయాలని, 100 అడుగుల కాస్త విగ్రహాన్ని నెల కోల్చేందుకు రాబోయే అసెంబ్లీ సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టాలని ప్రభుత్వం విడుదల చేసిన కొత్త మైనింగ్ జీవో 126 లో కొన్ని రకాల మీనారాళ్లకే పరిమితి విధించాలని 2010'20122015 జీవోల ప్రకారం ఉన్నట్టుగా 31 రకాల మిర్రల్లో 15 శాతం లేదు33 శాతం భాగస్వామ్యం కలిగించేలా జీవోను వెంటనే సమర్పించాలని కోరారు. జయహో బీసీ సభలో ఇచ్చిన హామీలకు వడ్డేరులను ఎస్టీ జాబితాలో చేర్చే పక్రియ ను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు . ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంగం నాయకులు చల్ల వెంకటేష్ వడ్డెర సంఘం నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో వైఎస్సార్‌సీపీ పోరాటాలను ఆపలేరు



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ప్రజా సమస్యలపై గళమెత్తుతున్న ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బానాయిస్తూ అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి తీవ్రంగా నిరసించారు. అక్రమ అరెస్టులతో పార్టీ పోరాటాలను ఎంతమాత్రం ఆపలేరని స్పష్టం చేశారు. ఇటీవల అరెస్ట్ అయి కర్నూలు జిల్లా కారాగారంలో (సబ్ జైలు) ఉన్న ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని సోమవారం కాటసాని రామభూపాల్ రెడ్డి ములాఖాత్ ద్వారా కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విరూపాక్షి ఆరోగ్య వివరాలను, జైలులో కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయనకు ధైర్యం చెబుతూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరియు అధినేత ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గొద్దు: పరామర్శ అనంతరం జైలు ప్రాంగణంలో కాటసాని మీడియాతో మాట్లాడుతూ... చట్టాన్ని రక్షించాల్సిన పోలీసు వ్యవస్థ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి పనిచేయడం విచారకరమన్నారు. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం వల్ల పోలీసు వ్యవస్థ ప్రతిష్ఠ తీవ్రంగా దెబ్బతింటోందని పేర్కొన్నారు. ప్రతీ పోలీసు అధికారి తమ మనసాక్షికి కట్టుబడి, రాజ్యాంగ బద్ధంగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు. "అధికారాలు, పదవులు ఏవీ శాశ్వతం కావు. కానీ చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా చేసిన సేవ మాత్రమే ఎప్పటికీ గుర్తుండిపోతుంది" అని హితవు పలికారు. ప్రజా సంక్షేమం కోసం, ప్రజల తరపున వైఎస్సార్‌సీపీ తన పోరాటాన్ని మరింత ఉధృతంగా కొనసాగిస్తుందని తేల్చి చెప్పారు.

ఈ పరామర్శ కార్యక్రమంలో కర్నూలు జిల్లా పార్టీ జనరల్ సెక్రెటరీ అక్కిమీ హనుమంత రెడ్డి, మాజీ కార్పొరేటర్లు గాజుల శ్వేతా రెడ్డి, నారాయణ రెడ్డి, కర్నూలు యువజన విభాగం అధ్యక్షుడు ఎద్దుల శివారెడ్డి, పాలకొలను రమేష్, సాయి కృష్ణ, ఎరుకల రాజు తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దళిత కాలనీలలో ప్రజా సమస్యలు పరిష్కరించాలి.

**మున్సిపల్ ఆఫీస్ ముందు కెవిపిఎస్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం.**




ఆదోని (పల్లె వెలుగు): ఆదోని పట్టణంలో నెలకొన్న దళిత కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలు పరిష్కరించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ధర్నా నుద్దేశించి కెవిపిఎస్ జిల్లా నాయకులు గోపాల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు విజయ్, నాగేంద్ర వీరు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దళిత కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కెవిపిఎస్ ఆధ్వర్యంలో సర్వేలు నిర్వహించడం జరిగిందని వారు తెలిపారు. పట్టణంలోని అరుణ్ జ్యోతి నగర్ నందు స్త్రీలు మరుగుదొడ్ల సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. స్త్రీల మరుగుదొడ్ల సమస్య పరిష్కరించాలని పాలకులకు, అధికారులకు ఎన్ని మార్లు విన్నయించిన చెవిటి వారి ముందు శంఖం ఊదిన చందంగా ఉందని వారు తెలిపారు. కల్లుబావి మాలగేరి నందు రోడ్లు, డ్రైనేజీ సమస్యతో అక్కడి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని వారు తెలిపారు. ప్రకాష్ నగర్ నందు సరైన కల్వర్టులు లేక ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. బుడేకల్, అంబేద్కర్ నగర్ నందు ఇంటి స్థలాల సమస్యతో ఒకే ఇంట్లో మూడు,నాలుగు కుటుంబాలు నివాసం ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. ఇందిరానగర్ నందు మంచినీటీ సమస్యతో బాధపడుతున్నారని వారు అన్నారు. ఈ విధంగా పట్టణంలోని దళిత కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజాసమస్యలు దిన పరిష్కరించాలని సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ నయుమ్ అహ్మద్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మన్న, ముక్కన్న, వెంకటేష్, నాగరాజు,శ్రీనివాసులు,మల్లయ్య,మోహన్,రాజు,నరసింహులు,నేతప్పతదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయాలను ప్రజల్లోకి.

**-జాలమంచి గ్రామంలో ఇంటింటికీ ప్రచార కార్యక్రమం**





ఆదోని (పల్లె వెలుగు): ఈరోజు ఆదోని మండలం జాలమంచి గ్రామంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న ఇంటింటికీ ప్రచార కార్యక్రమాన్ని, ఆదోని తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్, మాజీ శాసనసభ్యులు మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు, టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలిసి కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సూపర్ సిక్స్ హామీలు, తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా, దీపం పథకం, స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ, అన్నా క్యాంటీన్లు, మెగా డీఎస్సీ, యువతకు ఉపాధి కల్పన కోసం నిర్వహిస్తున్న జాబ్ మేళాలు వంటి పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. అదేవిధంగా ప్రజలతో నేరుగా మమేకమై ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేయడం, ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని వాటికి అనుగుణంగా మరింత మెరుగైన పాలన అందించడమే ఈ ఇంటింటికీ ప్రచార కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు రంగస్వామి నాయుడు, జిందే శంకర్, రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ రామకృష్ణ, రంగన్న, పట్టణ అధ్యక్షులు తిమ్మప్ప, మండల అధ్యక్షులు శివప్ప, క్లస్టర్ విరుపాక్షి, అయ్యన్న,తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ నాయకులు గోవిందు, బంగారయ్య, శరణప్ప, ఆంజనేయ, రామాంజనేయులు, హుసేని, ఆంజనేయ, రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# అల్లినగరంలో రోడ్డు ప్రమాదం..

- మితిమీరిన వేగంతో ప్రయాణం..
- ప్రమాదకర టిప్పర్లపై ప్రజల ఆందోళన..



మహానంది, పల్లె వెలుగు అతివేగంతో వెళ్తున్న టిప్పర్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. మహానంది మండలం అల్లినగరం గ్రామంలోని సాయిబాబా ఆలయం వద్ద రెండు టిప్పర్లు ఢీకొన్న ఘటనలో డ్రైవర్ కి గాయాలయ్యాయి. సోమవారం నేషనల్ హైవే రోడ్డుకు మట్టి తరలిస్తున్న టిప్పర్ మరో టిప్పర్ ని ఢీకొందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ కి గాయాలయ్యాయి అన్నారు. ప్రతినిత్యం పదుల సంఖ్యలో టిప్పర్లు మట్టిని అతివేగంగా తరలించడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గాజుల పల్లెలో కారును, అల్లీ నగరంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొని వ్యక్తి గాయాలు పాలైన ఘటనలు కూడా ఉన్నాయని స్థానిక ప్రజలు తెలిపారు. మితి మీరిన వేగంతో టిప్పర్లు రాకపోకలు సాగించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని బయోందళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోని ప్రాణాలు కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# హరిత ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం-మై వాయిస్ ప్రోగ్రాం విజయవంతం.






కాశినాయన, ఆగస్టు 3 (పల్లె వెలుగు) విద్యా ప్రదాత, ప్రముఖ సంఘ సేవకులు అమెరికాలో నివాసం ఉంటున్న డాక్టర్ ఫణి రాజ కుమార్ స్థాపించిన హరిత ఫౌండేషన్ ప్రభుత్వ విద్యారంగానికి మరియు సమాజ శ్రేయస్సుకు చేస్తున్న సేవలు ఎంతో విలువైనవని కడప జిల్లా విద్యాశాఖ అధికారి డా.ప్రశాంతి ,కాశి నాయన మండల వీఙూ లు మహమ్మద్ షఫీ, నిర్మల పేర్కొన్నారు. సోమవారం కాశినాయన మండలంలోని నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు మై వైఫ్ ప్రోగ్రాం డైరెక్టర్ విజయలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోలిరెడ్డి,కడప జిల్లా కోఆర్డినేటర్ పరిమళ జ్యోతి ఆధ్వర్యంలో మై వాయిస్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కాశి నాయన మండలంలోని ప్రభుత్వ హై స్కూల్స్ నందు చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు వకృత్వపు పోటీలు నిర్వహించి ప్రథమ స్థానం రషీద 5000/-,జడ్పీహెచ్ఎస్ రెడ్డి కొట్టాల, రెండవ స్థానం వహీదా 3000/-, జడ్పీహెచ్ఎస్ రెడ్డి కొట్టాల మూడవ స్థానం షర్మిల 2000/- జడ్పీహెచ్ఎస్ గొంటు వారి పల్లె, హర్షిత్ జడ్పీహెచ్ఎస్ నరసాపురం నగదు బహుమతులనుగారి చేతుల అందజేయడంతో పాటు పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులందరికీ మేమెంటోలు ,మోటివేషనల్ పుస్తకాలు, సర్టిఫికెట్స్ ,హరిత ఫౌండేషన్ నోట్ బుక్స్ అందించారు. మండల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా హరిత ఫౌండేషన్ తరపున కేజీబీవీ వరికుంట్లలోని పాలెం మెర్సి రాణి ని సత్కరించి అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల యందు చదువుతున్న పేద బడుగు బలహీన మధ్యతరగతి వర్గాల విద్యార్థులను ప్రోత్సహించడంలోనూ వారి ప్రతిభను వెలికి తీసి వారి విద్యాభివృద్ధికి సహకరించడంలోనూ హరితా ఫౌండేషన్ ప్రతినిధులు చేస్తున్న సేవలు కొన్ని యాడదగినవన్నారు .హరిత ఫౌండేషన్ కేవలం విద్యాభివృద్ధి పరంగానే కాకుండా పర్యావరణాన్ని పెంపొందించే క్రమంలో మొక్కలు నాటడం, ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం కోసం కృషి చేయడం, విద్యార్థులలో శాస్త్రీయ విజ్ఞానం నైతిక విలువలు క్రమశిక్షణ పెంపొందించడం తదితర బృహత్తర సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో అభినందనీయం అన్నారు .సమాజం కోసం విద్యార్థులు, ప్రజలలో సామాజిక చైతన్యం పెంపొందించడం కోసం వీరు చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో కాశి నాయన మండలంలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆగష్టు 5న రాష్ట్రవ్యాప్త కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలి-ఏబీవీపీ



బద్వేల్, ఆగస్టు 03 ( పల్లె వెలుగు ):రాష్ట్రంలో ఉన్న విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఆగష్టు 5వ తేదీన తలపెట్టిన రాష్ట్రవ్యాప్త కళాశాలల బంద్‌ను విద్యార్థులు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ అభిలాష్ పిలుపునిచ్చారు. సోమవారం బద్వేలులోని ప్రభుత్వ కళాశాలలో బంద్‌కు సంబంధించిన గోడపత్రిక (పోస్టర్)ను ఆయన విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు.?ఈ సందర్భంగా అభిలాష్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని విస్మరిస్తున్న తీరును తీవ్రంగా ఎండగట్టారు. బద్వేలు నియోజకవర్గం మొత్తంలో ఉన్నటువంటి అన్ని ప్రైవేట్, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ మరియు పీజీ కళాశాలల యాజమాన్యాలు,విద్యార్థులు ఈ బంద్‌కు పూర్తిగా సహకరించి విజయవంతం చేయాలని కోరారు. తక్షణమే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రధాన డిమాండ్లను వెల్లడించారు.

**ప్రధాన డిమాండ్లు:-**

1)?రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న రూ.6,800 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. 2)?డిగ్రీతో సహా అన్ని కోర్సుల ప్రవేశాలను తక్షణమే పూర్తి చేయాలి. అన్ని విశ్వవిద్యాలయాలకు ఉమ్మడి అకడమిక్ క్యాలెండర్ను ప్రకటించాలి. 3)?సాంఘిక సంక్షేమ వసతిగృహాలకు పక్కా భవనాలను నిర్మించి, విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి. 4)?ప్రభుత్వ పరీక్షల (అక్రమ పద్ధతుల నిరోధక) సవరణ బిల్లు, 2026ను పటిష్ఠంగా అమలు చేయాలి. 5)?రాష్ట్రంలోని ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో 'ఏ' కేటగిరీ విద్యార్థుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసే విధానాన్ని అరికట్టాలి. 6)?జీవో నంబర్ 77ను రద్దు చేసి,పీజీ చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించాలి. 7)?ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలి. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలి. 8)?కార్పొరేట్, ప్రైవేటు విద్యా వ్యాపారాన్ని అరికట్టి, పేద విద్యార్థులకు నాణ్యమైన, ఉన్నతమైన విద్య అందుబాటులో ఉంచాలి. 9)?ప్రతి జిల్లాకు ఒక ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలి. ?విద్యార్థుల భవిష్యత్తు కోసం తలపెట్టిన ఈ బంద్‌లో కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు అందరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.?ఈ కార్యక్రమంలో చంద్ర, హర్షవర్ధన్, రూప, కార్తీక్, హర్ష మరియు విద్యార్థులు పాల్గొన్నారు.


# వైశాచికత్వపు టీచర్ పై కేసు నమోదు



బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 3 : బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఈర్నపాడు గ్రామానికి చెందిన దీవెన(7) అనే బాలికపై అదే గ్రామానికి చెందిన మౌనిక అనే టీచర్ పై సోమవారం బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ జగన్మోహన్ పేర్కొన్నారు. గ్రామంలో నరేంద్ర ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న దీవెనపై మౌనిక అనే టీచర్ పైశాచికంగా కొట్టడంతో వీపుపై బలంగా గాయాలయ్యాయి. పాఠశాలలో అంకెలను అక్షరాల రూపంలో రాయమని దీవెనకు మౌనిక చెప్పినట్లుగా తెలుస్తోంది. ఈ విధానంలో దీవెన తప్పులు రాయడంతో కోపోద్రికురాలైన టీచర్ మౌనిక విచక్షణారహితంగా పైశాచికత్వంగా దీవెనను చితకబాదింది. ఈ విషయాన్ని ఇంట్లో చెబితే చంపేస్తానని కూడా బెదిరించినట్లు తెలుస్తోంది. ఆదివారం స్నానం చేయడానికి వెళ్లి వచ్చిన దీవెన బట్టలు వేసుకునేందుకు ఇబ్బంది పడుతుండగా తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించారు. తర్వాత ఈ విషయం గురించి టీచర్ మౌనికను మందలించేందుకు వెళ్లిన దీవెన నాయనమ్మ నాగమ్మపై కూడా దాడి చేసినట్లుగా సమాచారం. జరిగిన సంఘటనపై దీవెన తల్లిదండ్రులు రాత్రి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై పత్రికల్లో కథనాలు రావడంతో, పోలీసులు సోమవారం టీచర్ మౌనికపై కేసు నమోదు చేశారు. బాలిక దీవెనను వైద్య పరీక్షల నిమిత్తమై నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తీసుకొని వెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. దీవెనపై టీచర్ మౌనిక దాడి చేసిన విషయంపై విచారించి నివేదిక సమర్పించమని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి సంబంధిత విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారి మోహన్ రెడ్డి, ఈర్నాపాడు గ్రామంలోని ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్ పుల్లయ్య తోపాటు టీచర్ మౌనికను కూడా విచారించారు. చిన్నపిల్లను అమానుషంగా కొట్టడాన్ని విద్యాశాఖ అధికారి తప్పుపట్టారు. ఆడపిల్ల అన్న కనికరం లేకుండా విచక్షణారహితంగా కొట్టడాన్ని తప్పు పట్టారు. ఈ సంఘటన జరిగిన నాడే మౌనికను పాఠశాల నుండి తొలగించడం జరిగిందని కరస్పాండెంట్ పుల్లయ్య, మండల విద్యాశాఖ అధికారి గారికి వివరించారు. జరిగిన సంఘటనపై జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదిక పంపడం జరిగిందని ఎంఈఓ మోహన్ రెడ్డి వివరించారు.

# అభివృద్ధికి నోచుకోని దళిత వాడలు.

- **బసరకోడు గ్రామంలో దళిత కాలనీలో రోడ్డు, మరియు డ్రైనేజీ లేక ప్రజలు ఇబ్బందులు.**
- **పది రోజులకు ఒకసారి కూడా త్రాగడానికి మంచినీళ్లు రాకపోయినా పట్టించుకోని పాలకులు.**
- **వ్యవసాయ కార్మిక సంఘం కెవిపిఎస్ విమర్శ.**




ఆదోని (పల్లె వెలుగు): ఆదోని మండలం బసరకోడు గ్రామంలో దళిత కాలనీలో తిరగడానికి రోడ్డు, మరియు, మురుగు నీరు వెళ్లే డ్రైనేజీలు లేకపోవడంతో ఆ కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ కాలనీలో వెంటనే ప్రభుత్వం సిసి రోడ్లు డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు ఉచ్చిరప్ప, కెవిపిఎస్ మండల అధ్యక్షుడు మునిస్వామి, మరియు కెవిపిఎస్ నాయకులు రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈరోజు దళిత కాలనీలో వారు పర్యటించి స్థానికంగా ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. పది రోజులైనా త్రాగడానికి నీళ్లు అందడం లేదని ప్రజలు తెలిపారు అన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సచివాలయ అధికారులకు అందజేయడానికి వెళితే ఉదయం పది గంటల 40 నిమిషాలు అయినా అధికారులు సచివాలయానికి రాలేదని అధికారులు సమయపాలన కూడా పాటించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని సచివాలయాల తలుపులకు అతికించి రావడం జరిగింది. ప్రభుత్వం వెంటనే స్థానికంగా దళిత కాలనీలో ఉండే సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# అట్టహాసంగా పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం..

## ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలి..







### ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పిలుపు



**నూతన చైర్మన్‌కు ఘన సన్మానం**

**మహానంది, పల్లె వెలుగు**

మహానంది క్షేత్రానికి నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం సోమవారం అట్టహాసంగా జరిగింది. ముందుగా ఆలయ మర్యాదలతో నూతనంగా ఎంపికైన పాలక మండలి సభ్యులను అధికారులు, వేద పండితులు స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వామివారి ప్రత్యేక పూజలు నిర్వహించి గర్భాలయం ఎదురుగా నూతన పాలకమండలి చేత ప్రమాణ స్వీకారాన్ని ఈవో శ్రీనివాసరెడ్డి చేయించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ధర్మకర్తలుగా ఎన్నుకున్న 13 మంది చేత ప్రమాణస్వీకారం చేయించారు. వీరందరూ కలిసి ఏకగ్రీవంగా మసీదుపురం గ్రామానికి చెందిన నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డిని చైర్మన్ గా ఎన్నుకున్నారు. అనంతరం ఆలయం ఎదురుగా ఉన్న కళావేదికపై నూతన చైర్మన్ చేత ప్రమాణస్వీకారాన్ని చేయించి,తదుపరి సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ముఖ్యఅతిథిగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పాల్గొని మాట్లాడారు..రాష్ట్రంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో పరుగులు తీస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆలయాల కమిటీల నియామకం పారదర్శకంగా జరుగుతున్నాయన్నారు. హిందూ దేవాలయాలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబాలని వాటి ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అలయ అభివృద్ధికి అందరూ సమిష్టిగా సహకరించాలన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, బిజెపి, తెలుగుదేశం పార్టీల ముఖ్య నేతలు,నాయకులు, దేవస్థానం అధికారులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

---

# ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి తీరు ప్రజా స్వామ్యానికి మచ్చ.

**టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు.**



ఆదోని (పల్లె వెలుగు): నిన్నటి రోజు ఆలూరు నియోజకవర్గం చిప్పగిరి మండలం నిమికల్ గ్రామంలో ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి వ్యవహరించిన దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, ఆదోని టిడిపి ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు, ఆదోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు అన్నగారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉమాపతి నాయుడు మాట్లాడుతూ అధికారంలో ఉన్న ఐదేళ్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను వేధించి, ప్రశ్నిస్తే హత్యలు చేయడం, దాడులు చేసి బెదిరించి రాజకీయం చేసిన జగన్ రెడ్డి అధికారం కోల్పోయినా అదే తీరును ప్రదర్శిస్తున్నాడు.దళిత మహిళపై దాడి చేసి వివస్త్రను చేసిన ఎమ్మెల్యేను వెనకేసుకొస్తూ వైసిపి నాయకులు.కర్నూలు జిల్లా ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి తన అనుచరులతో కలిసి శనివారం రాత్రి చిప్పగిరి మండలం సంఘాల, నేమకల్లు గ్రామాల్లోని టీడీపీ దళిత కార్యకర్తల ఇళ్లపై ప్రత్యక్షంగా దాడులకు పాల్పడ్డ సంఘటనే ఉదాహరణగా నిలుస్తోంది.కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం నేమకల్లుకు చెందిన టీడీపీ కార్యకర్త గురునాథ్, సంగాలకు చెందిన వైసీపీ కార్యకర్త గిరి మధ్య ఫోన్లో ఇసుక అక్రమాలపై ప్రశ్నించిన నేపథ్యంలో వ్యక్తిగత వివాదం నడిచింది.వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య జరిగిన ఫోన్ సంభాషణ వివాదంపై ఎమ్మెల్యే విరూపాక్షి స్వయంగా రంగంలోకి దిగి గ్రామాల్లో అల్లర్లు సృష్టించాడు.అర్ధరాత్రి పూట వందల మంది గొడ్డలి పార్టీ కార్యకర్తలతో ఎమ్మెల్యేతో పాటు ఆయన కుమారుడు చంద్రశేఖర్, సోదరుడు శ్రీరాములు సహా గ్రామాల్లో హల్ చల్ చేశారు.కర్రలు, రాడ్లు, రాళ్లతో ఇళ్లపై దాడి చేసి సామాగ్రిని ధ్వంసం చేయడంతో పాటు, చిప్పగిరి మండల టీడీపీ కన్వీనర్ కొండా పురుషోత్తం బొలెరో వాహనాన్ని ధ్వంసం చేశారు.టీడీపీ నేత నాగరాజు ఇంట్లోకి దూరి దాడి చేయడంతో పాటు స్థానిక నేత కొండ పురుషోత్తం కారును, ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారు. బాధితురాలు సుచిత్ర ఇంట్లో వంట చేసుకుంటుండగా ఎమ్మెల్యే విరూపాక్షి లోపలికి వచ్చి దౌర్జన్యంగా లాగి తన్నారు, ఆమె నైటీని చింపివేయడంతో పాటు వివస్త్రను చేసే విధంగా ప్రవర్తించి దళిత మహిళను అవమానించారు.దాడికి గురైన టీడీపీ దళిత కార్యకర్త శేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు ఎమ్మెల్యే విరూపాక్షిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారని తెలియజేశారు.

సీసీటీవీ ఫుటేజ్, వీడియోలు, ఫోటోల ఆధారంగా ఎమ్మెల్యే స్వయంగా దాడుల్లో పాల్గొని బూతులు తిట్టినట్లు ఆధారాలను పోలీసులు సేకరించి జైలుకు పంపించారు.తప్పు చేసిన వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదనేది కూటమి ప్రభుత్వ విధానం.అధి ఎమ్మెల్యే అయినా ఏ ప్రజాప్రతినిధి అయినా బాధితులకు న్యాయం చేయడం, అణగారిన వర్గాల వైపు నిలబడటమే ఈ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత.

గ్రామాల్లో శాంతిభద్రతలను దెబ్బతీసి అన్నదమ్ములా కలిసి ఉండే ప్రజల మధ్య ఘర్షణలు పెట్టే విధంగా గొడ్డలి పార్టీ వ్యవహరిస్తోంది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు రంగస్వామి నాయుడు, రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ రామకృష్ణ, జిందే శంకర్, పట్టణ అధ్యక్షులు తిమ్మప్ప, మండల అధ్యక్షులు శివప్ప, కర్నూల్ పార్లమెంట్ ఉపాధ్యక్షులు రంగన్న, జయరాం, ఎక్స్ కౌన్సిల్ బాలాజీ ఐ సి రామకృష్ణ, సిద్ధ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ -- మనోబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాధ మానసిక వికలాంగులకు చేయూత.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, నంద్యాల జిల్లా శాఖ మరియు మనోబంధు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నంద్యాల పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో రోడ్లపై అనాధలుగా తిరుగుతూ, మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ముగ్గురు వ్యక్తులను గుర్తించి, వారికి వైద్య సహాయం అందించే కార్యక్రమం చేపట్టారు.



గాంధీ చౌక్, రైతు నగరం మరియు ఇతర ప్రాంతాల్లో తిరుగుతున్న ఈ అనాధ మానసిక వికలాంగులను రెడ్ క్రాస్ మరియు మనోబంధు ఫౌండేషన్ ప్రతినిధులు చేరదీసి, ముందుగా నంద్యాల రెడ్ క్రాస్ బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌కు తీసుకువచ్చి వారికి ఆహారం అందించారు.

అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం కడప రిమ్స్ మానసిక వైద్య ఆసుపత్రికి సురక్షితంగా తరలించారు. చికిత్స పూర్తి అయ్యి వారు కోలుకున్న తర్వాత వారి బంధువులను కనుగొని వారికి అప్పగించడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల మాట్లాడుతూ, మానసిక వికలాంగులను సమాజం నిర్లక్ష్యం చేయకుండా, వారికి అవసరమైన వైద్య సేవలు అందేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇలాంటి నిరాశ్రయులు ఎవరైనా నంద్యాల జిల్లాలో కనిపిస్తే వెంటనే రెడ్ క్రాస్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సేవా కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, మనోబంధు ఫౌండేషన్ ప్రతినిధులు సురేష్, కృష్ణారెడ్డి, రెడ్ క్రాస్ వాలంటీర్లు మరియు ఇతర సేవాభావులు పాల్గొన్నారు. ప్రజలకు విజ్ఞప్తి నంద్యాల జిల్లాలో ఎవరూ లేని, రోడ్లపై తిరుగుతూ మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న అనాధ వ్యక్తులు మీ దృష్టికి వస్తే, వెంటనే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, నంద్యాల జిల్లా శాఖకు సమాచారం అందించి వారి ప్రాణాలను, జీవితాలను కాపాడడంలో భాగస్వాములు కావాలని కోరారు. సంప్రదించవలసిన నంబర్లు 8985770583. 9347922901.

# ఎస్టేట్ అధికారిణి కల్యాణి బదిలీని రద్దు చేయాలి

**-జాయింట్ కలెక్టర్‌కు విన్నవించిన రైతులు, మహిళా సంఘాలు**

**-కలెక్టరేట్ ఎదుట ధర్నా.. వినతిపత్రం అందజేత**



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు సి-క్యాంప్ రైతు బజార్ ఎస్టేట్ అధికారిణి కల్యాణి బదిలీ ఉత్తర్వులను తక్షణమే రద్దు చేసి, ఆమెను అదే స్థానంలో కొనసాగించాలని కోరుతూ రైతులు, మహిళా పొదుపు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు రాతపూర్వక వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కర్నూలు రైతు సంఘాల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. ఎస్టేట్ అధికారిణి కల్యాణి రైతు బజార్ అభివృద్ధికి, రైతుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. మహిళా పొదుపు సంఘాల సభ్యులతో సమన్వయం పాటిస్తూ రైతు బజార్ నిర్వహణను సమర్థవంతంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ఇలాంటి ప్రాతిపదికగల అధికారిణి బదిలీ కావడం వల్ల రైతు బజార్ నిర్వహణతో పాటు రైతులు, మహిళా పొదుపు సంఘాల కార్యకలాపాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు, మహిళా పొదుపు సంఘాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా జాయింట్ కలెక్టర్ స్పందించి, కల్యాణి బదిలీ ఉత్తర్వులను పునఃపరిశీలించి రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ప్యాపిలిలో వైభవంగా 'ఇంటింటికీ కూటమి ప్రభుత్వం

పల్లె వెలుగు -?ప్యాపిలి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి



ప్రభుత్వ సంక్షేమ ఫలాలు, అభివృద్దే లక్ష్యంగా ప్యాపిలి గ్రామంలో 'ఇంటింటికీ కూటమి ప్రభుత్వం' కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక 7వ వార్డు 31వ బూత్ పరిధిలో కూటమి నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా పర్యటించారు. ?ఈ సందర్భంగా వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు కూటమి నాయకులు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. పలువురు స్థానికులు తమకు ఉన్న సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్తూ వినతిపత్రాలు అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన నాయకులు ప్రజా సమస్యలను త్వరితగతిన అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు.?ఈ కార్యక్రమంలో కూటమి మండల ఇంచార్జ్ ప్రభాకర్ రెడ్డి, ఖాజాపీర్, నారాయణమూర్తి, ప్రిన్సిపాల్ మధు, వెంకటేష్, మనోహర్, దాసు పాల్గొన్నారు.

# దళితవాడల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో వినతిపత్రం అందజేత.**

బేతంచెర్ల పల్లె వెలుగు ప్రతినిధి ఆగస్టు 3 :-- సామాజిక శంఖారావం కార్యక్రమంలో భాగంగా బేతంచెర్ల మండలంలోని ఆర్.ఎస్. రంగాపురం, అంబాపురం, గొర్లగుట్ట, కొమ్మురు కొట్టాల,ముద్దవరం మండలంలోని తదితర గ్రామాల దళితవాడలను, ఏపీ. రైతు సంఘం నాయకులు సందర్శించి, అక్కడి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. దళితవాడలలో నెలకొన్న మౌలిక సదుపాయాల కొరతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బేతంచెర్లమండల తహసీల్దార్ నాగమణికి, ఎంపీడీవోఫజల్ రహిమాన్ ,బేతంచెర్ల నగర పంచాయితీ కమిషనర్ డి. హరిప్రసాద్ కు సోమవారం నాడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో దళితవాడలలో నెలకొన్న సమస్యలను వివరిస్తూ సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు. ఆర్ఎస్.రంగాపురం గ్రామంలో దళితుల స్మశాన వాటికను అభివృద్ధి చేయడం, ప్రభుత్వం జి.ఓ. నెం.1235 ప్రకారం రెండు ఎకరాల భూమిని కేటాయించడం, స్మశానానికి రహదారి నిర్మించడం,విద్యుత్ ట్రాన్స్ ఫారం రోడ్ పక్కనే ఉన్నదని, కరెంట్ స్తంబానికి అతి తక్కువ ఎత్తులో బిగించిన ఫీజుబాక్స్ వల్ల, ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్నదని వెంటనే ట్రాన్స్ ఫారం ఎత్తు, ఫీజు బాక్స్ ఎత్తు పెంచాలని,ముద్దవరంగ్రామంలో కొత్త స్మశాన వాటిక ఏర్పాటు చేయడం, అంబాపురం దళిత వాడాలలో మహిళలకు ప్రజా మరుగుదొడ్లు నిర్మించడం, పనిచేయని వీధి దీపాలను వెంటనే వెలిగించడం, డ్రైనేజీ కాలువలను శుభ్రపరచడం, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర మౌలిక వసతులను కల్పించాలని వినతిపత్రంలో కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన అధికారులు సమస్యలను పరిశీలించి సంబంధిత శాఖల ద్వారా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులువి.సుబ్బరాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.మధు శేఖర్ మాట్లాడుతూ దళితవాడల ప్రజలకు కనీస మౌలిక వసతులు కూడా అందకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఒక మనిషి జీవితంలో చివరి ప్రయాణం కూడా గౌరవప్రదంగా సాగేందుకు అవసరమైన స్మశాన వాటికలు, రహదారులు లేకపోవడం అత్యంత బాధాకరమన్నారు. దళితవాడలలో పారిశుద్ధ్య లోపం, డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాలు వెలగకపోవడం, మహిళలకు మరుగుదొడ్లు లేకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని



తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అన్ని సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో దళితవాడల ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు సి.మద్దిలేటి స్వామి, రైతు సంఘం నాయకులు డి.రాజు, దళిత సంఘం నాయకులు జె. మద్దిలేటి, బి.బాలశేఖర్, ఎస్. రామాంజనేయులు, బి.బజారి, రామలకోట మద్దయ్య, నాగరాజు, రంగాపురం నాగరాజు, పాలకొల్లు సురేష్ మధు, తదితరులు పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com

